కల నెరవేరినట్లయింది

మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ముఫాసా– ది లయన్ కింగ్'. బారీ జెంకిన్స్ దర్శకుడు. 2019లో వచ్చిన యానిమేటెడ్ ఫిల్మ్ 'ది లయన్ కింగ్'కి కొనసాగింపుగా వాల్ట్ డిస్నీ పిక్చర్స్ పతాకంపై ఈ సినిమా రూపొందింది. ఇందులో ప్రధాన పాత్ర అయిన 'ముఫాసా'కి అగ్ర హీరో మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ సందర్భంగా 'ముసాఫా: ది లయన్ కింగ్'కి వాయిస్ ఇవ్వడం పట్ల తన ఎక్సయిట్‌మెంట్‌ని సోషల్ మీడియా ద్వారా ఆయన పంచుకున్నారు. 'ముఫాసా ఇప్పటివరకూ వచ్చిన అత్యంత పాపులర్ పాత్రల్లో ఒకటి. నాకు ఇష్టమైన పాత్ర. నేను ఎప్పట్నుంచో చూస్తున్న పాత్ర 'ముఫాసా'. తన కుటుంబాన్ని ముఫాసా చూసుకునే తీరు నిజంగా అద్భుతం. ఆ పాత్రకు డబ్బింగ్ చెప్పడం గౌరవంగా భావిస్తున్నా. 'ముఫాసా'కు డబ్బింగ్ చెప్పడంతో నా కల నెరవేరినట్టయ్యింది.' అని మహేష్ పేర్కొన్నారు. ఈ నెల 20న ప్రపంచ వ్యాప్తంగా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

భాగ్యనగరిలో 'ఫౌజీ'

అగ్ర హీరో ప్రభాస్ సినిమాల వేగాన్ని పెంచాడు. 'రాజాసాబ్' 'ఫౌజీ' (ట్రైటిల్ ఇంకా ఖరారు కాలేదు) చిత్రాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు. ' రాజా సాబ్' ఈ వేసవికి ప్రేక్షకుల ముందుకురానుంది. ఇక 'ఫౌజీ' సినిమాపై ప్రభాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెబుతున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి కథతో తెరకక్కిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా రెండో షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నది. ఇందులో ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా జైలుకు సంబంధించిన ఎపిసోడ్స్‌ను తెరకెక్కిస్తున్నట్లుగా తెలిసింది. ఈ సన్నివేశాలు కథలో కీలకంగా ఉంటాయని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని శరవేగంగా పూర్తి చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిసింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇమాన్వి కథానాయికగా నటిస్తున్నది.

బాక్సాఫీస్ రికార్డుల వేటలో..

'పుష్ప–2' తొలి రోజు నుంచే భారతీయ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తున్నది. తాజాగా ఈ సినిమా నాలుగు రోజుల్లో 829 కోట్ల కలెక్షన్స్ సాధించి ఈ ఫీట్‌ను సొంతం చేసుకున్న తొలి భారతీయ సినిమాగా నిలిచింది. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో సైతం పుష్పరాజ్ జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు. నాలుగో రోజు బాలీవుడ్‌లోనే 86కోట్లు వసూళ్లను రాబట్టింది. రాబోవు రోజుల్లో ఈ సినిమా మరిన్ని రికార్డులను బద్దలు కొడుతుందనే నమ్మకం ఉందని మేకర్స్ తెలిపారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'పుష్ప–2' విడుదల రోజు నుంచే సంచలన వసూళ్లతో దూసుకుపోతున్నది.

అల్లు అర్జున్‌కు అమితాబ్ ప్రశంసలు

అల్లు అర్జున్‌పై బాలీవుడ్ అగ్ర నటుడు, బిగ్‌బి అమితాబ్ బచ్చన్ ప్రశంసలు కురిపించారు. తాను అతని పనితీరుకు అభిమానినని తెలిపారు. 'పుష్ప–2' ప్రమోషనల్ కార్యక్రమాల్లో భాగంగా ముంబయి మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అమితాబ్ బచ్చన్ నటన ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అని, ఆయన సినిమాలు చూస్తూ తాను పెరిగానని, అమితాబ్‌ను స్ఫూర్తిగా తీసుకొని కెరీర్‌లో ముందుకెళ్తున్నానని బన్నీ చెప్పారు. తాజాగా ఈ వీడియోను అమితాబ్ బచ్చన్ తన సోషల్‌మీడియా ఖాతాల్లో షేర్ చేశారు. బన్నీ భవిష్యత్తులో ఎన్నో విజయాలు అందుకోవాలని, ఎంతో మందికి స్ఫూర్తినివ్వాలని అమితాబ్ బచ్చన్ తన పోస్ట్‌లో ఆకాంక్షించారు.

'ఆర్ఆర్ఆర్'పై డాక్యుమెంటరీ

రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా నటించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం ప్రపంచవేదికపై తెలుగు సినిమా సత్తాను చాటింది. ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్‌ను గెలుపొంది భారతీయ సినిమా ఖ్యాతిని పెంచింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ విశేషాలతో 'ఆర్ఆర్ఆర్' (బిహైండ్ అండ్ బియాండ్) అనే డాక్యుమెంటరీని రూపొందించారు. రాజమౌళి డైరెక్ట్ చేసిన ఈ డాక్యుమెంటరీని ఈ నెలలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'ఆర్ఆర్ఆర్' సినిమా మేకింగ్ సందర్భంగా జరిగిన సంఘటనలు, పోరాట ఘట్టాల రూపకల్పనకు సంబంధించిన విశేషాలతో ఈ డాక్యుమెంటరీని తెరకెక్కించినట్లుగా తెలిసింది. 'ఇప్పటికే ప్రపంచం ఈ సినిమా తాలూకు వైభవాన్ని చూసింది. అసలు దీని వెనక కథేమిటో చూడండి' అంటూ డాక్యుమెంటరీ గురించి 'ఆర్ఆర్ఆర్' బృందం సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టింది. 'ఇంటర్‌స్టెల్లార్' డాక్యుమెంటరీ తరహాలో 'ఆర్ఆర్ఆర్' డాక్యుమెంటరీని పరిమిత స్క్రీన్లలో ప్రదర్శించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆగస్ట్‌లో నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'మోడరన్ మాస్టర్స్' పేరుతో దర్శకుడు రాజమౌళిపై డాక్యుమెంటరీని విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో రాజమౌళి ఫిల్మ్‌మేకింగ్, గ్లోబల్ సక్సెస్‌తో పాటు బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమా విశేషాలను చూపించారు. ప్రస్తుతం రాజమౌళి తన తదుపరి సినిమా సన్నాహాల్లో బిజీగా ఉన్నారు. మహేష్‌బాబు కథానాయకుడిగా నటించనున్న ఈ చిత్రాన్ని అడ్వెంచరస్ కథాంశంతో తెరకెక్కించనున్నారు. 'గరుడ' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి.

నయనం నయనం కలిసే తరుణం

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న ఎమోషనల్ లవ్‌స్టోరీ 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. చిత్ర నిర్మాణం తుదిదశకు చేరుకున్నది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. స్టార్‌హీరో విజయ్ దేవరకొండ టీజర్‌ని లాంచ్ చేసి మాట్లాడుతూ 'ఈ సినిమాతో నటిగా రష్మిక బాధ్యత మరింత పెరుగుతుందని ఆశిస్తున్నా. టీజర్‌లో విజువల్స్ బావున్నాయి. మనసుల్ని కదిలించే కథతో సినిమా తీశారని తెలుస్తున్నది. మూవీ చూసేందుకు వెయిట్ చేస్తున్నా.' అన్నారు. ఇక టీజర్ విషయానికొస్తే.. ఓ కాలేజ్ హాస్టల్‌లోకి రష్మిక అడుగుపెడుతున్న సీన్‌తో టీజర్ మొదలైంది. హీరోహీరోయిన్ల బ్యూటిఫుల్ రిలేషన్‌ని టీజర్‌లో చూపించారు. 'నయనం నయనం కలిసే తరుణం.. ఎదనం పరుగే పెరిగే వేగం..' అంటూ విజయ్ దేవరకొండ ఇచ్చిన వాయిస్‌ఓవర్ ఈ టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణ. 'రేయి లోలోతుల సీతార..' అనే పాట బీజీఎం.. 'ఇదేదో పికప్ లైన్ అయితే కాదుగా.. అస్సలు పడను..' అంటూ రష్మిక చెప్పే డైలాగ్ ఇది వైవిధ్యమైన ప్రేమకథ అని చెప్పకనే చెబుతున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: కృష్ణన్ వసంత్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాణం: గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్మెంట్.

రామ్‌చరణ్ చేతులమీదుగా..

సాయిదుర్గతేజ్ హీరోగా రోహిత్ కేపీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'SDT18' వర్కింగ్ టైటిల్‌తో సాయిదుర్గ తేజ్ కెరీర్‌లోనే హై బడ్జెట్‌లో రూపొందుతోన్న ఈ చిత్రానికి కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి. ఈ నెల 12న హైదరాబాద్‌లో ఈ సినిమాకు సంబంధించిన గ్రాండ్ ఈవెంట్‌ని మేకర్స్ నిర్వహించనున్నారు. అగ్ర హీరో రామ్‌చరణ్ ఈ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసి 'SDT18 కార్నేజ్'ను లాంచ్ చేయనున్నారు. సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమా ఇదని, ఈ సినిమా ఈవెంట్‌కి రామ్‌చరణ్ అతిథిగా రానుండటం చాలా ఆనందంగా ఉందని మేకర్స్ తెలిపారు. ఐశ్వర్యలక్ష్మి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్. నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్స్.

వెంటాడుతున్నది ఎవరు?



వేదిక లీడ్‌రోల్ చేసిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్ర పోషించారు. డా.హరిత గోగినేని ఈ చిత్రానికి దర్శకురాలు. డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మాతలు. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం హీరో మాధవన్ సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్‌ని ఆయన అభినందించారు. ఇక ట్రైలర్ విషయానికొస్తే.. మానసిక సమస్యలతో బాధపడుతున్న సింధుగా వేదిక ఇందులో కనిపించింది. ఎవరో తనను వెంటాడుతున్నట్టు భయపడుతుంటుంది. ఎవరు ధైర్యం చెప్పినా ఆమెను ఫియర్ వదలదు. చికిత్సకోసం సింధుని హాస్పిటల్‌లో చేర్చారు. అసలు సింధుని వెంటాడుతున్నది ఎవరు? ఆమె ఎందుకు భయపడుతున్నది? అనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. ట్రైలర్ చివర్లో వేదిక ద్విపాత్రాభినయంలో కనిపించడం థ్రిల్‌కి గురిచేసింది. జెపి(జయప్రకాష్), పవిత్రలోకేష్, అనీష్ కురువిల్ల, సాయాజి షిండే, సత్యకృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఐ.ఆండ్రూ.

శ్రీరాముడు నా డ్రీమ్ క్యారెక్టర్

నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక పౌరాణిక చిత్రం 'రామాయణ'. బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ రెండు భాగాలుగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ముహూర్త బలమేమో గానీ.. ఈ సినిమా షూటింగ్ చకచకా పూర్తి కావస్తున్నది. రీసెంట్‌గా ఇందులో శ్రీరాముడిగా నటిస్తున్న రణబీర్ కపూర్.. ఫస్ట్ పార్ట్‌లో తనకు సంబంధించిన షూటింగ్ అంతా పూర్తి చేసుకున్నానని ఆనందం వ్యక్తం చేస్తూ తన సోషల్‌మీడియా ద్వారా అప్‌డేట్ ఇచ్చారు. 'నా కల నెరవేరింది. ఈ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నందుకు గర్వంగా కూడా ఉంది. చిన్నప్పట్నుంచీ మనం వింటూ పెరిగిన గొప్ప కావ్యం రామాయణం. ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులతో రెండు భాగాలుగా నితీష్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పార్ట్‌వన్‌లో నా భాగం పూర్తయింది. త్వరలోనే పార్ట్2 షూటింగ్ కూడా మొదలుకానుంది. శ్రీరాముడిగా నటించడం నాకల. ఈ సినిమాతో అది తీరిపోయింది. మన దేశ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప సినిమాలో భాగం అయినందుకు ఆనందంగా ఉంది' అని తెలిపారు రణబీర్ కపూర్. ఇదిలావుంటే.. ఇటీవలే ఈ సినిమాల విడుదల తేదీలను చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. 2026 దీపావళికి తొలిభాగం, 2027 దీపావళికి మలి భాగం విడుదల చేయనున్నట్టు వారు ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఎన్టీఆర్, ఏఎన్నార్ చేయాల్సిన పాత్ర ఇది

''హరికథ' సిరీస్ చూశాక, 'సినిమాగా ఎందుకు తీయలేదు?' అనడుగుతారు. స్ట్రాంగ్ కంటెంట్‌తో రూపొందిన సినిమా ఇది. ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి మహానటులు చేయాల్సిన పాత్ర నాకు దక్కడం నా అదృష్టం. హరికథలు చెబుతూ బతికే గంగా చారిగా ఇందులో కనిపిస్తా. ప్యాషన్‌తో తీసిన సిరీస్ ఇది. అందరూ కచ్చితంగా ఇష్టపడతారు.' అని డా.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రగా రూపొందిన వెబ్‌సిరీస్ 'హరికథ'. మ్యాగీ దర్శకుడు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 13 నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. వైవిధ్యమైన చాలా పెద్ద స్క్రిప్ట్ ఇదని, యూనిట్‌లోని ప్రతిఒక్కరి సహకారం వల్లే ఈ సిరీస్ చేయగలిగానని, ముఖ్యంగా టీజీ విశ్వప్రసాద్ లాంటి ప్రొడ్యూసర్ దక్కడం తమ అదృష్టమని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు. దివి, పూజిత పొన్నాడ, శ్రీరామ్, మౌనికరెడ్డి, అర్జున్ అంబటి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్‌కి కెమెరా: విజయ్ ఉళగనాథ్, సంగీతం: సురేశ్ బొబ్బిలి.

రియల్ కోర్ట్ డ్రామా

వీర్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి, ఢిల్లీ గణేశ్, గిరిధర్ ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'లీగల్లీ వీర్'. రవి గోగుల దర్శకుడు. శాంతమ్మ మలికిరెడ్డి నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఇప్పటివరకూ ఇలాంటి లీగల్ థ్రిల్లర్స్ తెలుగు తెరపై రాలేదని, రియల్ కోర్ట్ డ్రామా ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారని, ఈ నెల 27న సినిమాను విడుదల చేస్తున్నామని హీరో వీర్‌రెడ్డి చెప్పారు. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డానని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: జాక్సన్ జాన్సన్, అనూష్, సంగీతం: శంకర్ తమిరి, సమర్పణ: ఎం.వీరనారాయణరెడ్డి, నిర్మాణం: సిల్వర్ కాస్ట్.

అంతకుమించితే ప్రమాదం!

వ్యాయామం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, పరిమితికి మించి శరీరాన్ని ఇబ్బంది పెడుతూ కష్టాలను కొనితెచ్చుకోవద్దని సలహా ఇచ్చింది కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్. ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చే ఈ భామ రెండు నెలల క్రితం జిమ్‌లో గాయపడిన విషయం తెలిసింది. 80 కిలోల బరువును ఎత్తే క్రమంలో ఆమె వెన్నెముకపై అధికభారం పడటంతో అనారోగ్యానికి గురైంది. ఇటీవల కోలుకున్న ఈ భామ తన ఆరోగ్యం గురించి అప్‌డేట్ అందించింది. ఆరోగ్యపరంగా శరీరం అందించే సంకేతాలకు జాగ్రత్తగా గమనించాలని, అందుకు అనుగుణంగా నడచుకోవాలని సూచించింది. 'వెన్నెముక గాయం రెండు వారాల్లో తగ్గిపోతుందనుకున్నా. కానీ రెండు నెలల టైమ్ పట్టింది. ఈ గాయం వల్ల కఠినమైన వ్యాయామాలకు దూరంగా ఉంటున్నా. సరళమైన ఆహారాన్ని తీసుకుంటున్నా. మన శారీరక పరిమితిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటుంది. కానీ ఒక్కోసారి అంతకుమించిన శ్రమతో ఇబ్బంది పెడతాం. అలాంటి తప్పుల వల్లే అనుకోకుండా ప్రమాదంలో పడతాం' అని చెప్పుకొచ్చింది ఇటీవల సినిమాలకు కాస్త గ్యాప్ వచ్చిన రకుల్ ప్రీత్.. రాబోవు ఏడాదిలో తాను నటించిన మూడు చిత్రాలు విడుదలకానున్నాయని తెలిపింది.

డ్రింకర్ సాయి ప్రేమకథ

వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ప్రేమకథాచిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటిస్తున్నారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. హీరోహీరోయిన్లు ధర్మ, ఐశ్వర్య తమ పాత్రలకు ప్రాణం పోశారని, యువతరం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకే కొంత యూత్‌ఫుల్ కంటెంట్‌ని ఈ కథలో పెట్టాల్సొచ్చిందని, నిజానికి ఇది అన్ని వర్గాలు మెచ్చే కథ అని, సాంకేతికంగా అన్ని విధాలా సినిమా ఆకట్టుకుంటుందని దర్శకుడు చెప్పారు. సినిమాలో నటించడం పట్ల హీరోహీరోయిన్లు ధర్మ, ఐశ్వర్య శర్మ ఆనందం వెలిబుచ్చారు. ట్రైలర్‌లో ఎంత ఇంట్రస్టింగ్ కంటెంట్ ఉందో, అంతకు మించి సినిమాలో ఉంటుందని, నరేట్ చేసిన దానికంటే అద్భుతంగా సినిమాను దర్శకుడు కిరణ్ తీశాడని, పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్ర యూనిట్ అంతా మాట్లాడారు. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్.ఎస్.కాంచి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి.

గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో పద్నాలుగు రోజులు

అంకిత్ కొయ్య, శ్రియా కొంతం జంటగా రూపొందిన రొమాంటిక్ లవ్‌స్టోరీ '14డేస్ గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో'. శ్రీహర్ష దర్శకుడు. సత్య నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా స్నీక్ పీక్‌ను సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మేకర్స్ లాంచ్ చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'సెన్సిబుల్ మెసేజ్ ఇస్తూనే ఆద్యంతం నవ్వించేలా సినిమా ఉంటుంది. ఇదో కొత్త కంటెంట్. అన్ని వయసులవారూ చూడదగ్గ సినిమా ఇది.' అన్నారు. కొత్తవాళ్లమంతా కలిసి ఈ సినిమా తీశామని, హీరో అంకిత్‌కి మంచి పేరు తెచ్చిపెట్టే సినిమా అవుతుందని దర్శకుడు నమ్మకం వెలిబుచ్చారు. 'అమృతం' సీరియల్‌లా అందరికీ నచ్చే సినిమా ఇదని, గర్ల్‌ఫ్రెండ్ ఇంటికి వెళ్లిన హర్ష అనే కుర్రాడు, అక్కడ డోర్ లాక్ అవ్వడంతో ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు? అనేది ఫన్నీగా చూపించామని తెలుగమ్మాయి శ్రియ అద్భుతంగా నటించిందని, అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని హీరో అంకిత్ తెలిపారు.